
సాక్షి ఒడిశా

శుక్రవారం । 17 । ఫిబ్రవరి । 2023




శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలక వర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3.97.710లు, బంగారం 6.25 గ్రాములు, వెండి 94.42 గ్రాములువచ్చాయని అధికారులు వెల్లడించారు.



సాగులో సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

- 8లో



2,855 కిలోల గంజాయి స్వాధీనం

- 8లో

న్యూస్‌రీల్

బార్ ఎన్నికల అధికారిగా అక్షయ్ పట్నాయక్



అక్షయ్ పట్నాయక్‌ను అభినందిస్తున్న బార్ అసోసియేషన్ న్యాయవాదులు

బరంపురం: గంజాం బార్ అసోసియేషన్ ఎన్నికలు మార్చి 25న జరగనున్న నేపథ్యంలో బార్ ప్రస్తుత అధ్యక్షుడు కపిలేశ్వర్ పట్నాయక్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమక్షంలో ఎన్నికల అధికారిగా సీనియర్ న్యాయవాది అక్షయ్‌కుమార్ పట్నాయక్‌ను గురువారం నియమించారు. ఈ సందర్భంగా ఆయనను కపిలేశ్వర్ పట్నాయక్, సీనియర్ న్యాయవాదులు పుష్పగుచ్ఛాలతో అభినందించారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు సత్కారం



ఎన్‌సీసీ అధికారులతో సన్మాన గ్రహీతలు

రాయగడ: దేశ రాజధాని ఢిల్లీ రాష్ట్రపతి భవన్ వద్ద ఇటీవల ముగిసిన గణతంత్ర వేడుకల్లో భాగంగా పరేడ్, సాంస్కృతిక, ప్రత్యేక కార్యక్రమాల్లో రాయగడ రెండో బెటాలియన్ బాలికల విభాగానికి చెందిన 8మంది బాలికలు పాల్గొన్నారు. ఇందులో అంతా ఉత్తమ ప్రతిభ చాటిన నేపథ్యంలో స్థానిక ఆర్‌కే నగర్‌లోని రెండో బెటాలియన్ మహిళ ఎన్‌సీసీ కార్యాలయంలో గురువారం సన్మానించారు. కల్నల్ కమాండెంట్ అధికారి వీఎస్ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. దేశ గణతంత్ర దినోత్సవాల్లో రాయగడకు చెందిన క్యాడెట్లు అర్పిత పాఢి, అంకిత అన్నపూర్ణ, రాగిని బహదూర్‌లామా, పూజా పండా, ఇతిశ్రీ మహారాణా, ప్రియదర్శిని సాహు, ప్రియాంక పరిడా, ఏ.జ్యోత్స్న పాల్గొనడం గర్వకారణమని అభినందించారు. కార్యక్రమంలో లెఫ్టినెంట్ అర్చనా పట్నాయక్, సార్జెంట్ ప్రియాంక పరిడా పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఇద్దరి మృతి



మదన్ బొయి మృతదేహం

కొరాపుట్: లారీ ఢీకొని ఇద్దరు యువకులు మృతిచెందిన ఘటన కొరాపుట్ జిల్లా కేంద్రంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. నొగుడ గ్రామానికి చెందిన మదన్ బొయి(23), శివ బొయి(21) బైక్‌పై కొరాపుట్ వస్తున్న సమయంలో మచ్చర రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న లారీ వీరిని ఢీకొంది. మదన్ ఘటనా స్థలంలో మృతిచెందాడు. దీనిపై సమాచారం అందుకున్న కొరాపుట్ సదర్ పోలీసులు అక్కడికి చేరుకొని, తీవ్ర గాయాలపాలైన శివను సాహిద్ లక్ష్మణ్ నాయక్ ప్రభుత్వ వైద్య కళాశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మాట నిలబెట్టుకున్నారు..



పీడీఎస్ డిపోను ప్రారంభిస్తున్న సమితి అధ్యక్షుడు ప్రశాంత గుప్తా

జయపురం: మూడంచెల పంచాయతీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను బొయిపరిగుడ సమితి అధ్యక్షుడు ప్రశాంతకుమార్ గుప్తా ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారు. బొయిపరిగుడ సమితి పూజారిగుడ పంచాయతీ ప్రజలకు ఎంతో కాలంగా పీడీఎస్ బియ్యం, సామాజిక పింఛన్లు పొందడానికి ఇబ్బందులు పడుతుండేవారు. తమ సమస్యలను ఎన్నికల సమయంలో గ్రామానికి వచ్చిన బీజేడీ నాయకుడు, సమితి అభ్యర్థి ప్రశాంతకుమార్‌కు తెలియజేయగా, విజయం సాధిస్తే సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆయన సమితి అధ్యక్షుడిగా ఎన్నిక కాగా, ఇచ్చిన మాట ప్రకారం పూజారిగుడ పంచాయతీ కార్యాలయంలో పీడీఎస్ బియ్యం, అత్యవసర సరుకుల విక్రయ కేంద్ర డిపోను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు గుప్తాకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్య మాఝి, బీడీఓ అభిమన్యు కవి శత్పతి, జిల్లా పరిషత్ సభ్యులు రాజేశ్వర మహలిమా, సమితి సివిల్ సప్లై అధికారి హరిశరణ మల్లిక్, సహాయ అధికారి మధుసూదన రౌత్, హరిహర నాయక్, కిశోర్ బెహరా, నరేంద్రరావు పాల్గొన్నారు.



శివ శివ శంభో..

- మహా శివరాత్రికి శైవక్షేత్రాలు ముస్తాబు
- పర్లాకిమిడి మహేంద్రగిరుల్లో ప్రత్యేక ఏర్పాట్లు
- భక్తులను ఆహ్వానిస్తున్న బరంపురం అష్టశంభో లింగాలు
- ఉమ్మడి కొరాపుట్ జిల్లాల్లో ప్రకృతి ఒడిలో ఎన్నో చారిత్రక ఆలయాలు



మహేంద్రగిరి పర్వతాలు

లయ కారుని ఆలయాలు శివరాత్రికి ముస్తాబయ్యాయి. భక్త సులభుని నామ స్మరణకు శైవక్షేత్రాలు సన్నద్ధమయ్యాయి. కొండల్లో వెలసిన నీలకంఠుని దర్శించుకునేందుకు భక్త జనమంతా ఎదురు చూస్తోంది. పతిత పావనుడి పర్వదినాన్ని ఉత్సాహంగా జరుపుకొనేందుకు ప్రభుత్వం యంత్రాంగం సైతం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. శనివారం మహా శివరాత్రి నేపథ్యంలో రాష్ట్రంలోని వివిధ శైవ క్షేత్రాలపై ప్రత్యేక కథనం.

– సాక్షి నెట్‌వర్క్

ఒకే రోజులో.. 100 కిలోమీటర్లు



బరంపురం: భక్తులను ఆకట్టుకుంటున్న శిద్ధమైన ఖొలేశ్వార్ ఆలయం

బరంపురం: నగరం పరిసర ప్రాంతాల్లో సాక్షాతు భూమి నుంచి వెలసిన అష్టశంభో లింగాలకు శివరాత్రి ప్రత్యేక విశిష్టత ఉంది. ఒకేరోజు వీటన్నిటినీ దర్శించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. బరంపురానికి చెందిన అంచల్‌ని మౌరిరాజుకు కలలో శివుడు కనిపించి, భూమిలో వెలిసిన ప్రాంతాలను చెప్పడంతో, వాటి ఆనవాళ్ల ఆధారంగా మరుసటి రోజు ఉదయం వెతికారు. ఆయా ప్రాంతాల్లో 8శివలింగాలు కనిపించడంతో ఆలయాలు నిర్మించడమే కాకుండా ప్రతి వారం వాటిని దర్శించుకొనేవారు. నిత్య దీప, ధూప, నైవేద్యాల నిమిత్తం కొంత భూములివ్వగా, వాటితో వచ్చిన ఫలసాయంతో ఇప్పటికీ ఈ ఆలయాలు నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు. నగరంలోని ఎంకేసీజీ మెడికల్ కళాశాల నుంచి 5కిలోమీటర్ల దూరంలో ఉన్న బబిన్‌పూర్‌లో శంకేశ్వర్ స్వామి ఆలయ ఉండగా, అక్కడి నుంచి 18కిలోమీటర్ల ప్రయాణంలో గొళంతరా లోని ఈశానేశ్వర్‌ను దర్శించుకోవచ్చు. ఇక్కడి నుంచి 8కిలోమీటర్ల ప్రయానిస్తే కొళొథిగాంలో ఖొలేశ్వర్ ఆలయానికి చేరుకోవచ్చు. మరో 4కిలోమీటర్ల దూరంలో రళవ చేరుకుంటే.. కొండేశ్వర్‌ను, అక్కడి నుంచి 6కిలోమీటర్లలో గోంజులో సోమేశ్వర్ స్వామిని దర్శించుకోవచ్చు. ఇక్కడి నుంచి 18కిలోమీటర్ల దూరంలో టంగనాపల్లి లోని సుందరేశ్వరుని, మరో 25కిలోమీటర్ల ప్రయాణంలో లాఠీలోని బ్రహ్మేశ్వర్‌ను, అక్కడ నుంచి 8కిలోమీటర్ల దూరంలో ఉన్న సుకుండాలో ఖశేశ్వర్ ఆలయానికి ఒకే రోజులో చేరుకోవచ్చు.

చారిత్రక క్షేత్రాలు..




పూజలందుకుంటున్న పాతాలేశ్వరుడు



రాయగడ: శివరాత్రి ఉత్సవాలకు సిద్ధమైన దేవగిరి కొండ

రాయగడ: జిల్లా కేంద్రానికి 50 కిలోమీర్ల దూరంలో ఉన్న దేవగిరి కల్యాణ సింగుపూర్ సమితి పరిధిలోకి వస్తుంది. ఇక్కడ పూజలందుకుంటున్న దేవగిరీశ్వరుడు శిలారూపంలో కొలువై ఉన్నాడు. సుమారు 120.2 మీటర్ల ఎత్తులోని కొండపై వెలియడంతో దేవగిరీశ్వరునిగా గుర్తింపు పొందారు. ఎత్తయిన కొండపైకి చేరుకోవాలంటే 578 మెట్లను ఎక్కాల్సిందే. అనంతరం కొండపై గుహల మధ్య దేవగిరీశ్వరుడు భక్తులను దర్శన భాగ్యం కల్పిస్తాడు. అలాగే గుణుపూర్ సబ్ డివిజన్ పరిధిలోని గుడారి, చంద్రపూర్ సమితుల మధ్య ఉన్న మీనాజోలలో మీనకేశ్వరుడు శిలారూపంలో భక్తులకు దర్శనమిస్తుంటారు. ఈ శైవ క్షేత్రాన్ని అభివృద్ధి పరిచేందుకు జిల్లా యంత్రాంగం ఇటీవల చర్యలు చేపట్టింది. సబ్ కలెక్టర్ లలిత్‌కుమార్ కుహారో తదితరులు ఇటీవల పర్యటించి, అభివృద్ధికై ప్రణాళికలు రూపొందించారు.

త్రేతాయుగం నాటి గుప్తేశ్వరుడు..



జయపురం: ప్రకృతి ఒడిలో ఆకట్టుకుంటున్న గుప్తేశ్వర్ గుహ

జయపురం: దక్షిణ ఒడిశాలో ప్రసిద్ధ శివక్షేత్రం గుప్తేశ్వర్ లింగం త్రేతాయుగం నుంచి భక్తులకు దర్శనమిస్తోంది. ఇక్కడి స్వామివారి ఆశీస్సులతో సూర్యవంశపు రాజుల మూల పురుషుడు వినాయక దేవ్ 1443లో అప్పటి నందపూర్ రాజు ప్రతాప్ గంగరాజు కుమార్తె లీలావతిని వివాహమాడి, నందపూర్ రాజధానిగా సింహాసనాన్ని అధిష్టించారు. అనంతరం 17వ శతాబ్దంలో అతని వంశీయులు రాజధానిని జయపురానికి మార్చారు. అప్పటి నుంచి జయపురం సామ్రాజ్యంలో శివపూజలు విస్తృతమయ్యాయి. చుట్టుపక్కల భైరవసింగపూర్, బొరిగుమ్మ, చటికోణ, దేవగిరి, కొండకోనేరు, మీనాజోల, నందపూర్, పద్మపూర్, పపడహండి, కెచల, ఇటీవల వెలుగు చూసిన వెయ్యి లింగాల కుటిపాదర్ తదితర క్షేత్రాలు ఉన్నాయి. దట్టమైన దండకారణ్యంలో శబరి నదీ ఒడ్డున అహ్లాదకరమైన వాతావరణంలో పర్వత గుహలో 10 అడుగుల కైవారం, 8 అడుగుల ఎత్తైన అపూర్వ శివలింగమే గుప్తేశ్వరుడు. త్రేతాయుగంలో పర్వత గుహలో వెలసిన ఈ లింగం.. నాలుగు శతాబ్దాల క్రితం 1648–1669 మధ్య జయపురం సామ్రాజ్యాన్ని పాలించిన రాజా వీరవిక్రమదేవ్ కాలంలో ఈ శివలింగం వెలుగు చూసిందని చరిత్రకారుల అభిప్రాయం. పురాతన ఈ లింగం చరిత్ర.. శతాబ్దాల పాటు గుప్తంగా ఉండటంతో గుప్తేశ్వరుడిగా పేరొచ్చిందని కూడా చెబుతుంటారు.

వనవాసంలో..

శ్రీరాముడు అరణ్యవాసం సమయంలో దండకారణ్యంలోని పంచవటికి వెళ్తూ గుప్తేశ్వర్ ప్రాంతంలో కేదానాథుని భక్తితో పూజించగా, శివుడు మెచ్చి ప్రత్యక్షమయ్యాడు. రాముడి కోరిక మేరకు కలియుగ ప్రజలకు దర్శనమిచ్చేందుకు లింగరూపంలో వెలిశాడని ప్రతీతి. గుప్తేశ్వర గృహకు చేరువలోని మరో గుహలో కామధేనువుగా కొలవబడే రాతి శిల నుంచి తెల్లని పాల బింధువు పడుతూ ఉంటుంది. పక్కనే ఉన్న మరో సొరంగ మార్గం నుంచి కాశీకి గతంలో మార్గం ఉండేదని స్థానికులు చెబుతుంటారు.

ఎండల మల్లికేశ్వరుడు..



మల్కన్‌గిరి: కొండపైకి వెళ్లేందుకు నిర్మించిన మెట్ల మార్గం

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని పాత్రగూడ పరిధిలోని కొండలపై వెలసిన మల్లికేశ్వర ఆలయానికి ఎంతో విశిష్టత ఉంది. ఎంతో పురాతనమైన ఈ ఆలయం 50 ఏళ్ల క్రితం బయటపడటం గమనార్హం. స్థానిక గిరిజనుడు సమీపంలోని కొండపైకి ఆవులను మేతకు తీసుకు వెళ్లగా, ఓ శిలారూపాన్ని చూసి ఆశ్చర్యానికి గురయ్యాడు. వెంటనే గ్రామంలోకి వచ్చి, విషయం చెప్పగా, అంతా పైకి వెళ్లి చూడటంతో ఓ చిన్న శివలింగం కనిపించింది. జయపురం రాజుల హయాంలో ఇక్కడి శివలింగాన్ని ప్రతిష్ఠించినట్లు భావిస్తున్నారు. ఇక్కడి శివలింగం రోజురోజుకీ పెరగడంతో ఎండల మల్లికేశ్వరుడి పేరుతో పూజలు చేస్తున్నారు. పర్యాటక శాఖ ఆలయాన్ని అభివృద్ధి పరిచి, కొండపైకి చేరుకొనేందుకు 600 మెట్లు నిర్మించింది. అలాగే ఇక్కడి ఆలయంలో గిరిజనులే పూజారులుగా ఉండటం గమనార్హం.


కోటి లింగాల కుట్నిపాదర్..



కొరాపుట్: శయన దశలో విష్ణువు

కొరాపుట్: కోటి లింగాల ప్రాంతంగా గుర్తించిన కుట్నిపాదర్ బాహ్య ప్రపంచానికి దూరంగా ఉంది. జిల్లాలోని లక్ష్మీపూర్ సమితి కుసుంపాదర్ పంచాయతీ కుటినిపాదర్ గ్రామ సమీపంలో కొండపై ఈక్షేత్రం ఉంది. కొండపై ఎటువైపు మట్టి తొలగించినా ఇక్కడ శివలింగాలు బయట పడుతున్నాయి. ఎన్నో శతాబ్దాలుగా ఇక్కడ శివలింగాలు ఉన్నప్పటికీ కేవలం 15 ఏళ్ల క్రితం ఇవి వెలుగు చూశారు. ముక్తేశ్వర్‌నాథ్‌గా పిలవబడుతూ కోటి లింగాలు ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. కొరాపుట్–రాయగడ మార్గం లో కక్కిరిగుమ్మ సమీపంలో కుసుంగుడ గ్రామ జంక్షన్ నుంచి కేవలం 3కిలోమీటర్ల దూరం లోనే ఈ క్షేత్రం ఉంది. ఇక్కడ శతాబ్దాల నాటి శివ, తరణి, విష్ణు, గణేష్, జగన్నాథ, భైరవ మూర్తుల విగ్రహాలు ఉన్నాయి. శివరాత్రి పర్వదినంలో కొరాపుట్, రాయగడ జిల్లాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలి వస్తుంటారు.

మహేంద్రగిరులు..



పర్లాకిమిడి: మహేంద్రగిరిలో కుంతీ మందిరం

పర్లాకిమిడి: ఒడిశా–ఆంధ్రప్రదేశ్ సరిహద్దులోని మహేంద్రగిరి పర్వతాలు తూర్పు కనుమల్లో పర్వత శ్రేణులుగా ఉన్నాయి. ఈ ప్రాంతం సముద్ర మట్టానికి సుమారు 5వేల అడుగుల ఎత్తులో ఉంది. ఇక్కడే మహేంద్రతనయ పుట్టి, పర్లాకిమిడి, పాతపట్నం మీదుగా హిరమండలం గొట్టా వద్ద వంశధార నదిలో కలుస్తుంది. సత్య యుగంలో పరమశివుడు చేసిన గోహత్య పాపం నుంచి పరిహారం చేసుకునేందుకు ఈ మహేంద్రగిరుల్లో తపస్సు చేసినట్లు శివపురాణం చెబుతోంది. అలాగే ద్వాపర యుగంలో శ్రీకృష్ణుడు, బలరాముడు ఇక్కడే పరశురాముని దర్శించుకోవడంతోపాటు పాండవులు తమ వనవాస కాంలో ఈ ప్రాంతంలోనే నివాసం ఏర్పరచుకున్నట్లు నిర్మితమై ఉన్న కుంతీ, యుధిష్టర్, భీముని మందిరాలు ద్వారా స్పష్టం అవుతున్నాయి. మహేంద్రగిరిలో ఉన్న ఈ మందిరాలలో ఎటువంటి దేవతా విగ్రహాలు ఉండవు. కేవలం కుంతీ మందిరంలోనే శివలింగాన్ని ప్రతిష్ఠించారు.

ఎంతో అనుభూతి..

మహాశివరాత్రి సందర్భంలో మహేంద్రగిరికి గజపతి జిల్లా రాయఘడ బ్లాక్ కోయిపుట్ మీదుగా 50 కిలోమీటర్లు బస్సు, కారు మార్గం ద్వారా భక్తులు చేరుకోవచ్చు. కోయిపూర్ వద్ద బుర్‌ఖాత్ పాస్ వద్ద ఉన్న ఫారెస్ట్ చెక్‌పోస్టులో కార్ల పార్కింగ్‌కు రుసుం చెల్లించాలి. అక్కడి నుంచి కాలినడకన 3కిలోమీటర్లు ప్రయాణిస్తే మహేంద్రగిరి చేరుకోవచ్చు. అలాగే శ్రీకాకుళం జిల్లా మందస మండలం మీదుగా 70 కిలోమీటర్లు ప్రయాణించి, మహేంద్రగిరులకు సందర్శించవచ్చు. కొండపై పరశురాం కుండ్, భాస్కరతీర్థ లక్ష్మీబాబా ఆశ్రమం ఉంటాయి. ఇక్కడ ప్రతి యాత్రికుడు విశ్రాంతి తీసుకుని, ఉచితంగా అన్నప్రసాదాలు స్వీకరించవచ్చు. కొండదిగితే గోకర్ణేశ్వర్వ మందిరం, అర్ధనారీశ్వరుడు, పాండవ గుహలను చూడవచ్చు. శివరాత్రి ముందు రోజు మహేంద్రానికి చేరుకొని, అక్కడే రాత్రి బస చేయడంతో పాటు సూర్యోదయం, ప్రకృతి దృశ్యాలను చూడటం, కుంతీ మందిరంలో శివలింగాన్ని దర్శించుకోవడం ఎంతో అనుభూతి ఇస్తుందని యాత్రికులు చెబుతుంటారు.



బరంపురం: శివరాత్రికి సిద్ధమవుతున్న ఈశానేశ్వర్ ఆలయ ముఖద్వారం




జయపురం: గుప్తేశ్వర్‌లో త్రేతాయుగం నాటి మహాలింగం



రాయగడ: దేవగిరి కొండపై ఉన్న కొలను



పర్లాకిమిడి: మహేంద్రగిరిలో భక్తులకు దర్శనమిస్తున్న శివలింగం




జయపురం: గుహ నుంచి గుప్తేశ్వరుని దర్శనానికి వెళ్తున్న భక్తులు



మల్కన్‌గిరి: కొండపై వెలసిన మల్లికేశ్వరుడి విగ్రహం



కొరాపుట్: ముక్తేశ్వర లింగం



కొరాపుట్: దారి పొడుగునా దర్శనమిస్తున్న శివలింగాలు

క్లుప్తంగా

నవరంగ్‌పూర్ కలెక్టర్‌కు పురస్కారం



సీఎం నుంచి పురస్కారం స్వీకరిస్తున్న కలెక్టర్ మిశ్రా

కొరాపుట్: రాష్ట్ర రాజధాని భువనేశ్వర్ లోని కళింగ స్టేడియంలో బుధవారం రాత్రి జరిగిన అభినందన కార్యక్రమంలో నవరంగ్‌పూర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ కమలోచన్ మిశ్రా సీఎం నవీన్ పట్నాయక్ నుంచి పురస్కారం అందుకున్నారు. ఇటీవల జరిగిన ప్రపంచ పురుషుల హాకీ ప్రపంచకప్ పోటీల్లో నవరంగ్‌పూర్ జిల్లాలో గ్రామస్థాయి నుంచి పోటీలు ఘనంగా నిర్వహించారు. గ్రామసభల నిర్వాహన, వీధుల్లో హాకీ పోటీల వీక్షణ కోసం ఏర్పాట్లు, అవగాహన ర్యాలీలు చేపట్టారు. ఈ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించినందుకు ఈ పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి తుషార్‌కాంతి బెహరా, 5టీ కార్యదర్శి కార్తికేయ పాండ్యన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్ మహాపాత్రో, ప్రిన్సిపల్ సెక్రటరీ అను గార్గ్ పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్



అదనపు సీడీఎంఓకు సమస్యను వివరిస్తున్న సెక్యూరిటీ గార్డులు

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ గార్డులకు గత 3నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని వారంతా ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు ఆస్పత్రి ఎదుట గురువారం ధర్నాకు దిగారు. ఆస్పత్రిలో పని చేస్తున్న 82మంది సెక్యూరిటీ సిబ్బంది, మరికొందరు ఆయాలకు 3నెలలకు సంబంధించి జీతాలు అందించలేదని తెలిపారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా, ఫలితం లేకపోయిందని వాపోయారు. వారం రోజుల్లో బకాయి వేతనాలు చెల్లించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం జిల్లా అదనపు వైద్యాధికారి శశిభూషన్ మాహపాత్రోకు వినతిపత్రం అందించారు.

గ్రానైట్ ఎక్స్‌పోలో ఉత్తరాంధ్ర ప్రతినిధులు



హాజరైన అసోసియేషన్ ప్రతినిధులు

టెక్కలి: బెంగళూరులో ఇటీవల నిర్వహించిన గ్రానైట్ ఎక్స్‌పో (గ్రానైట్ ఉత్పత్తులు, మెషినరీ) ప్రదర్శనకు ఉత్తరాంధ్ర గ్రానైట్ అసోసియేషన్ ప్రతినిధులు హాజరయ్యారు. ఎగ్జిబిషన్‌లో ప్రపంచ వ్యాప్తంగా వివిధ రకాల గ్రానైట్ ఉత్పత్తులు, మెషినరీలు, గ్రానైట్ వ్యాపారానికి అవసరమైన టెక్నాలజీను ప్రదర్శించినట్లు ప్రతినిధులు తెలిపారు. ఉత్తరాంధ్ర గ్రానైట్ అసోసియేషన్ నుంచి సుంకరి కృష్ణ, చింతాడ గణపతి, కోత మురళీధర్, వరుదు దేవిప్రసాద్, కూన రవికుమార్, కె.హరి, ఎ.నగేష్, వి.వి.రాజు, రామారావు, ధవళ రాజేంద్ర హాజరయ్యారు.

శ్రీశైల మల్లన్న తలపాగా ఊరేగింపు



తలపాగాను ఊరేగిస్తున్న చేనేత కార్మికులు

ఆమదాలవలస రూరల్: శ్రీనివాసాచార్యులపేట గ్రామంలో శ్రీశైలం మల్లికార్జునస్వామి కోసం చేనేత మగ్గంపై నేసిన తలపాగాను గురువారం ఊరేగించారు. గ్రామానికి చెందిన చేనేత సంఘం ఆధ్వర్యంలో శివరాత్రి రోజున మల్లన్నకు సమర్పించడం కోసం 180 మీటర్లు తలపాగాను మగ్గంపై నేశారు. గ్రామస్తుల కోరిక మేరకు పురవీధుల్లో తలపాగాను మేళతాళాల మధ్య ఊరేగించగా మహిళలు పూజలు చేశారు. అనంతరం తలపాగాను శ్రీశైలం తీసుకు వెళ్లేందుకు చేనేత కార్మికులుపయనమయ్యారు.

ఘనంగా ఆదిత్యుని కల్యాణం

అరసవల్లి: ఉషా పద్మిని ఛాయాదేవి అమ్మవార్లతో సూర్యనారాయణస్వామి వారి కల్యాణోత్సవం గురువారం స్థానిక అనివెట్టి మండపంలో ఘనంగా జరిగింది. మాఘ బహుళ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆగమశాస్త్రం ప్రకారం కల్యాణ ప్రక్రియను ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. వెండి సింహ వాహనంలో వేంచేపజేసిన కల్యాణమూర్తుల కల్యాణ సేవలో పలువురు భక్తులు రూ.500 చెల్లించి పాల్గొన్నారు. వీరికి స్వామి వారి శేషవస్త్రాలతో పాటు కల్యాణ తలంబ్రాలను అందించారు.

సాగులో సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

- సీఎం నవీన్ పట్నాయక్ పిలుపు
- బరముండా మైదానంలో కృషి ఒడిశా ఉత్సవాలు ప్రారంభం



ఉత్సవాలను ప్రారంభిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: సాగులో యాంత్రీకరణ, పంటల వైవిధ్యంపై దృష్టి సారించి, నూతన సాంకేతిక పరిజ్ఞానంతో రైతాంగం సాధికారిత సాధించాలని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ పిలుపునిచ్చారు. అభివృద్ధికి సాంకేతిక పరిజ్ఞానం సోపానమని అభిప్రాయం వ్యక్తంచేశారు. రాష్ట్ర రాజధాని నగరంలోని బరముండా మైదానంలో కృషి ఒడిశా–2023 ఉత్సవాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈనెల 18వరకు ఈ ఉత్సవం కొనసాగనుంది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో అధునాతన సాంకేతిక పరికరాలు, పనిముట్ల వినియోగం పట్ల రాష్ట్ర రైతాంగం దృష్టి సారించాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో సాగును బహుముఖంగా అభివృద్ధి పరచాలని సూచించారు. వ్యవసాయం, రైతుల అభివృద్ధి ప్రభుత్వ కర్తవ్యంగా పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో ఒడిశా అగ్రగామిగా కొనసాగుతోందని, ఆహార కొరత పరిస్థితులను అధిగమించి ఆహార ధాన్యాల మిగులు రాష్ట్రంగా ఎదిగిందని తెలిపారు. యావత్ దేశ ప్రజాపంపిణీ వ్యవస్థకు బియ్యం సరఫరా చేసే స్థాయికి ఎదగడం గర్వ కారణమన్నారు. కాలియా యోజన పథకం రైతులకు ఉద్యోగ భద్రత కల్పించిందని, వ్యవసాయ యాంత్రీకరణకు పెద్దపీట వేస్తూ పంటల ఉత్పాదకతను పెంచేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు.

2దశాబ్దాల్లో గణనీయంగా ఆదాయం..

వ్యవసాయ ఉత్పాదనల అభివృద్ధికి పాణిసా(పనస) మిషన్, ఛొత్తు(పుట్ట గొడుగులు) మిషన్ వంటి ప్రత్యేక పథకాల నిరంతర కార్యాచరణ కొనసాగుతుందని సీఎం నవీన్ ప్రకటించారు. పౌష్టిక భద్రతతో రైతాంగానికి జీవనోపాధి హామీ కల్పించడం ఈ పథకాల ప్రాధాన్యతగా పేర్కొన్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖ ఆవిష్కరించిన మిల్లెట్ మిషన్ ప్రస్తుతం యావత్ దేశం, ప్రపంచం దృష్టిని ఆకట్టుకుంటోందన్నారు. మిషన్‌శక్తి మహిళల ఆదాయ వనరులను మెరుగు పరుస్తోందని తెలిపారు. రాష్ట్ర వ్యవసాయశాఖామంత్రి రణేంద్ర ప్రతాప్ స్వాయి మాట్లాడుతూ గత 2దశాబ్దాల్లో చేపలు, మాంసం, గుడ్లు, పాడి ఉత్పాదనలో రాష్ట్రం స్వయం సమృద్ధి సాధించి, రైతుల ఆదాయాన్ని గణనీయంగా పెంపొందించినట్లు వెల్లడించారు. ఒడిశా స్కిల్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ సుబ్రతో బాగ్చీ, అదనపు చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ అనుగర్గ్, వ్యవసాయ, రైతు సాధికారత అభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ అరవింద్‌కుమార్ పాఢి, విభాగం డైరెక్టర్ ప్రేమ్‌చంద్ చౌదరి తదితర ఉన్నతాధికారులతో రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసిన రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతాంగానికి సాగు పనుల్లో యాంత్రిక పరిజ్ఞానం పట్ల ప్రత్యేక శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు.



బరముండా గ్రౌండ్‌లో ఆకట్టుకుంటున్న కృషి ఒడిశా-2023 ఉత్సవ ప్రాంగణం



హాజరైన వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు, నాయకులు

2855కిలోల గంజాయి ధ్వంసం



గంజాయిని ధ్వంసం చేస్తున్న అధికారులు

రాయగడ: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పోలీసులు ఇటీవల దాడులు నిర్వహించి, స్వాధీనం చేసుకున్న 2855.615 కిలోల గంజాయిని జిల్లా డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో ధ్వంసం చేశామని ఎస్పీ వివేకానంద శర్మ గురువారం ప్రకటించారు. ఈ మేరకు 26 ఎన్‌డీపీఎస్ కేసులను నమోదు చేశామన్నారు. జిల్లాలో గంజాయిపై ఉక్కుపాదం మోపిన పోలీసులు విరివిగా తనిఖీలు నిర్వహించి, గంజాయి మాఫియా ఆట కట్టిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌డీపీఓ దేవజ్యోతి దాస్, డీఎస్పీ సుధా మల్లిక్, ఎక్సైజ్‌శాఖ అధికారులకు పాల్గొన్నారు.

491లీటర్ల సారా స్వాధీనం

జిల్లా ఎక్సైజ్‌శాఖ రాయగడ పరిసర ప్రాంతాలతో పాటు గుణుపూర్‌లో నిర్వహించిన దాడుల్లో 491 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి 13మందిని అరెస్ట్ చేశామని ఆశాఖ సూపరింటెండెంట్ అభిరాం బెహరా తెలిపారు. దాడుల్లో భాగంగా 5,600 లీటర్ల ఊటను ధ్వంసం చేసి, తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

గంజాయితో నిందితుడి అరెస్ట్



జయపురం: గంజాయితో పట్టుబడిన సంతోష్‌కుమార్

జయపురం: పట్టణ పోలీసులు సూర్యమహల్ ప్రాంతంలో నివసిస్తున్న సంతోష్‌కుమార్ సింగ్(46) నుంచని 22.45 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. స్థానికంగా గంజాయి విక్రయాలతో పాటు కొంతమంది వ్యక్తులు శాంతి, భద్రతలకు విఘాతం కలిగించే విధంగా వ్యవహరిస్తున్నారని అందిన ఫిర్యాదు మేరకు ఐఐసీ సిద్ధార్థ బెహరా ప్రత్యేక బృందం విస్తృతంగా దాడులు నిర్వహించారు. అటుగా స్కూటీలో వస్తున్న సంతోష్‌కుమార్‌ను తనిఖీ చేయగా, అతని వద్ద ఉన్న సంచిలో గంజాయి బైటపడింది. ఈ మేరకు నిందితడిని అరెస్ట్ చేసి, కేసు నమోదు చేశారు.

గ్రామాల్లో వైద్యసేవలు మృగ్యం



సమీక్షలో మాట్లాడుతున్న సీడీఎంఓ రౌత్రాయ్, వేదికపై జెడ్పీ అధ్యక్షురాలు మాఝి, త్రిపాఠి

- జిల్లా పరిషత్ సమీక్షలో ఆగ్రహం వ్యక్తం చేసిన సభ్యులు

రాయగడ: జిల్లాలో సరైన వైద్య సేవలు అందకపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని జిల్లా పరిషత్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి అధ్యక్షతన గురువారం జరిగిన 76వ జిల్లా పరిషత్ సమీక్ష సమావేశంలో పాల్గొన్న సభ్యులు.. తమ ప్రాంతాల్లో నెలకొన్న వివిధ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఇందులో ప్రధానంగా వైద్య సేవలపై సుదీర్ఘంగా చర్చలు జరిగాయి. ఏ చిన్న ఆరోగ్య సమస్య తలెత్తినా రోగులను జిల్లా కేంద్రానికి తరలించాల్సి వస్తోందని, కొన్ని పీహెచ్‌సీల్లో అసలు వైద్యులే ఉండటం లేదని సీడీఎంఓ డాక్టర్ లాల్‌మోహన్ రౌత్రాయ్‌ను నిలదీశారు. కాసీపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిరంతర సేవలు పొందడంలో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారని జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి అసంతృప్తి వ్యక్తంచేశారు. ప్రసూతి సమయాల్లో మహిళలకు సరైన సేవలందక నానా అవస్థలు పడుతున్నారని, సిబ్బంది కొరతే దీనికి కారణమన్నారు.

జిల్లాలో 45 ప్రసూతి కేంద్రాలు..

ప్రసూతి మహిళలకు సకాలంలో వైద్య సౌకర్యాలు అందేలా జిల్లాలో 45 ప్రాంతాల్లో ప్రసూతి గృహాలను ఏర్పాటు చేశామని జిల్లా ముఖ్య వైద్యాధికారి డాక్టర్ లాల్‌మోహన్ రౌత్రాయ్ తెలిపారు. ఆయా కేంద్రాల్లో 20 అంబులెన్స్‌లు నిరంతర సేవలు అందిస్తున్నాయన్నారు. గ్రామాల్లో వైద్య సేవల నిమిత్తం జిల్లాలో 1867మంది ఆశా కార్యకర్తలు తమ సేవలను అందిస్తున్నారని పేర్కొన్నారు. అలాగే 2,330 గ్రామాల్లో కల్యాణ సమితి, పట్టణ ప్రాంతాల్లో మరో 24వార్డు కల్యాణ సమితి కేంద్రాలు పని చేస్తున్నాయని వెల్లడించారు. అయితే జిల్లాలో 100మంది వైద్యులు పోస్టులు ప్రస్తుతం ఖాళీగా ఉన్నాయని, వీటి భర్తీకి త్వరలోనే చర్యలు చేపడతామని ప్రకటించారు. సిబ్బంది పనితీరు, అందిస్తున్న సేవలను తెలుసుకునే విధంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు.

గ్రామాల్లో దాహం కేకలు..

చంద్రపూర్, రామనగుడ తదితర సమితుల్లో తాగునీటి సమస్యలు విలయతాండవం చేస్తున్నాయని పరిషత్ సభ్యులు ప్రస్తావించారు. సోలార్ విద్యుత్‌తో తాగు నీరందించే గొట్టపు బావులు దాదాపు మరమ్మతులకు గురయ్యాయని, దీంతో ప్రజలు తాగునీటికి కటకటలాడుతున్నారని తెలిపారు. రానున్నది వేసవికాలం కావడంతో గ్రామాల్లో గొట్టపు బావులను త్వరితగతిని బాగు చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. మరోవైపు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు విచ్చిన రైతులను సంబంధిత శాఖ అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని పలువురు సభ్యులు విమర్శించారు. సకాలంలో మండీలు ఏర్పాటు చేయకపోవడంతో కేంద్రాల్లో టోకెన్ల లేక ధాన్యాన్ని విక్రయించే అవకాశాలు జరగక, రైతులు నానా అవస్థలు పడుతున్నారని రామనగుడ సమితి ఏ జోన్‌కు చెందిన జిల్లా పరిషత్ సభ్యుడు తంగుడు శ్రీధర్ ఆరోపించారు. అనంతరం విద్య, రహదారులు తదితర అంశాలపై సమీక్షించారు. సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ రవినారాయణ త్రిపాఠి, సీఎస్ఓ రాజ్‌కిశోర్ పాణిగ్రాహి, జిల్లా విద్యాశాఖ అధికారి పూర్ణచంద్ర భొరియా, జిల్లా సంక్షేమశాఖ అధికారి అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న జిల్లా పరిషత్, సమితి సభ్యులు

ఉపాధి వేతనదారు మృతి



తిరుమరెడ్డి కమల (ఫైల్)

మందస: చికిత్స పొందుతూ ఉపాధి హామీ పథకం వేతనదారు మృతి చెందింది. వివరాల్లోకి వెళ్లితే.. హరిపురం గ్రామానికి చెందిన తిరుమరెడ్డి కమల (59) హరిపురంలోని కోనేల చెరువు అభివృద్ధి పనులకు హాజరవుతుండేవారు. ఈ నెల పదో తేదీన చెరువులోని పిచ్చిమొక్కలు కాల్చుతున్న సమయంలో అటువైపు వెళ్లిన కమలకు మంటలు వ్యాపించాయి. గాయపడిన ఆమెను తొలుత హరిపురంలోని సామాజిక ఆరోగ్యకేంద్రంలో చేర్పించి చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం టెక్కలి ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడి నుంచి శ్రీకాకుళంలోని రిమ్స్, ఆ తరువాత విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మరణించింది. మృతురాలి కుటుంబాన్ని ఎంపీడీఓ, ప్రొగ్రాం అధికారి వాయలపల్లి తిరుమలరావు, ఏపీవో బి.వి. హరికృష్ణ, ఈసీ చింతా సురేష్‌వర్మ, టీఏలు మాధురి, వాసుదేవు, కృష్ణారావు, భారతి, దాలయ్య, చింతామణి, పుష్పలత పరామర్శించి సంతాపం తెలియజేశారు. కమల మృతిపై మందస హెడ్ కానిస్టేబుల్ రవీంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని ఎస్ఐ వై.రవికుమార్ చెప్పారు.

శతాధిక వృద్ధుడు మృతి



పెద్దశ్రీరామూర్తి (ఫైల్)

హిరమండలం: భగిరధిపురం అగ్రహారానికి చెంది న శతాధిక వృద్ధుడు కొల్లూరు పెద్ద శ్రీరామూర్తి (107) గురువారం మృతి చెందారు. కొన్ని రోజులుగా వయోభారంతో బాధపడుతున్న ఈయన ఇంటి వద్దనే కన్నుమూశారు. 1916లో పేద బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన శ్రీరామూర్తి వేద విద్యను అభ్యసించారు. ప్రాథమిక స్థాయి నుంచే అవధానం, చతుర్వేదాల్లో పట్టు సాధించా రు. ప్రభుత్వ ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహించారు. ఉద్యోగ విరమ ణ అనంతరం వేద విద్య శిక్షణను ప్రారంభించారు. అవధానంలో దిట్ట. తెలుగు భాష అంటే ఎనలేని అభిమానం. తెలుగు భాషకు వన్నె తగ్గడంపై తరచూ తన ఆవేదన వ్యక్తం చేసేవారు. ఈయనకు 50 మందికి పైగా మునుమనవులు ఉన్నారు.

గడ్డికుప్పలు దగ్ధం

మెళియాపుట్టి: అగ్ని ప్రమాదంలో ఐదెకరాల్లో సాగు చేసిన వరిగడ్డి కాలిపోయింది. ఈ సంఘటన నందవ కొత్తూరు గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. రైతు అనంతగిరి అప్పారావు ఐదు ఎకరాల్లో సాగు చేసిన వరి పంటను నూర్పు చేసి పశువుల దాణాకోసం గడ్డిని కుప్పగా వేసి ఉంచుకున్నారు. అగ్ని ప్రమాదంలో గడ్డి దగ్ధం కావడంతో రైతు కన్నీరుమున్నీరయ్యారు. గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేసేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. అప్పటికే మంటలు ఎగసి పడటంతో గడ్డి కుప్ప పూర్తిగా కాలిపోయిందని స్థానికులు తెలిపారు. ప్రమాదానికి కారణం తెలియరాలేదు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని డైమండ్ పార్క్ దరి రహదారి వద్ద గత నెల 18న పడిపోయిన పెద్దపాడుకు చెందిన బొట్ట కృష్ణ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. కృష్ణకు మూర్ఛ వ్యాధితోపాటు మద్యం అలవాటు ఉంది. ఈ క్రమంలోనే రోడ్డుపై పడిపోవడంతో తలకు గాయమైంది. బంధువులు అతన్ని రిమ్స్‌కు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు.

వ్యక్తి బలవన్మరణం



దేవదాసు మృతదేహం వద్ద విచారణ చేస్తున్న పోలీసులు

కంచిలి:

వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన పెద్దశ్రీరాంపురం గ్రామంలో బుధవారం రాత్రి చోటుచేసుకోగా.. తాండ్ర దేవదాసు అలియాస్ పొట్టయ్య (45) తనకు చెందిన తోటలోని చెట్టుకు ఉరిపోసుకొని ప్రాణాలు తీసుకున్నాడు. పోలీసులు గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. దేవదాసు కుటుంబ సభ్యుల మధ్య 15 ఏళ్లుగా 22 సెంట్ల భూమికి సంబంధించి వివాదం నడుస్తోంది. ఈ విషయమై గ్రామంలో బుధవారం పెద్దల సమక్షంలో పంచాయితీ జరిగింది.

ఇందులో చెప్పిన పరి ష్కారం వలన తనకు అధికంగా ఆర్థిక నష్టం సంభవిస్తుందని భావించి దేవదాసు కలత చెందాడు. బహిర్భూమికని చెప్పి బయటకు వెళ్లిన ఆయన తిరిగి ఇంటికి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు గాలించగా.. మామిడి చెట్టుకు ఉరిపోసుకొని చనిపోయి ఉండటాన్ని గుర్తించారు. మృతుని భార్య చంద్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నటుట కంచిలి ఎస్ఐ ఎస్.చిరంజీవి గురువారం తెలిపారు.

ఎరువుల కర్మాగానికి వ్యతిరేకంగా ఆందోళన



ఆందోళన చేస్తున్న కరిపల్లి గ్రామస్తులు

- కరిపల్లి గ్రామస్తులపై పోలీసుల లాఠీచార్జ్



ఎరువుల కంపెనీ నిర్మాణ స్థలం వద్ద మొహరించిన పోలీసుల

బరంపురం: గంజాం జిల్లా కరిపల్లి గ్రామంలో టాటా కంపెనీ ఆధ్వర్యంలో నిర్మాణం చేపట్టిన అత్యాధునిక ఎరువుల కర్మాగారం పనులను వెంటనే నిలుపుదల చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కర్మాగారం నిర్మాణ స్థలంలో గత 2 రోజులుగా ఆందోళన నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆందోళనకారులపై పోలీసులు బుధవారం లాఠీచార్జ్‌కు దిగడంతో చర్చనీయాంశంగా మారింది. కరిపల్లి గ్రామ నాయకుడు మోహన్‌పాత్రో, పెద్దలు తెలిపిన వివరాల ప్రకారం.. కరిపల్లి గ్రామస్తుల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా టాటా కంపెనీ యాజమాన్యం తమ గ్రామానికి చెందిన పంట పొల్లాల్లో ఎరువుల కర్మగారాన్ని నిర్మిస్తోందని తెలిపారు. దీని ఫలితంగా గంజాం జిల్లాలో సంప్రదాయ మొగలి పువ్వులు సాగుకు పూర్తిగా నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ఇదే విధంగా కరిపల్లి, కోరపల్లి, మండియాపల్లి, గొళాబంద, చమ్మాఖండి, బాతులపేట తదితర 20కి పైగా గ్రామలు పూర్తిగా కలుషితమై, వేలాది ఎకరాలు భూములు బీడుమారే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. పనులు నిలుపుదల చేసే వరకు వెనక్కి తగ్గబోమని తెగేసి చెప్పారు. ఈ నేపథ్యంలో ఆందోళనకారులు ఒక్కసారిగా పోలీసులు ఏర్పాటు చేసిన బెరికేడ్లను కూలగొట్టి, లోపలికి చొరబడ్డారు. స్పాట్ మేజిస్ట్రేట్, గంజాం తహసీల్దార్ అరుణ్‌కుమార్ నాయక్ ఆదేశాలతో రంగంలోకి దిగిన పోలీసులు.. ఆందోళన కారులపై లాఠీలతో విరుచుకుపడ్డారు. దీంతో పరిసర ప్రాంతం ఒక్కసారిగా ఉద్రిక్తరూపం దాల్చింది. పోలీసుల దాడిలో 15మందికి పైగా ఆందోళనకారులకు గాయాలు కాగా, ఎంకేసీజీకి తరలించి, వైద్య సేవలందిస్తున్నారు. లాఠీచార్జి ఘటనలో ఇద్దరు ఏఎస్పీలు, ఆరుగురు డీఎస్పీలు, 18మంది ఇన్‌స్పెక్టర్లు, 21 ప్లాటూన్ల బలగాలు పాల్గొన్నారు. ఆందోళనకారులు శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ దివ్యజ్యోతి పరిఢాను కలిసి, చర్చలు జరపనున్నట్లు సాధన సమితి అధ్యక్షుడు మోహన్‌పాత్రో తెలిపారు.

విద్యార్థుల్లో చదివే శక్తిని పెంచాలి



కేజీబీవీలో విద్యా సామర్థ్యాలను పరిశీలిస్తున్న వెంకటరెడ్డి

- ఎల్‌ఐపీ రాష్ట్ర పరిశీలకుడు వెంకటరెడ్డి

సారవకోట: విద్యార్థుల్లో చదవ గలిగే శక్తి పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం రాష్ట్ర పరిశీలకులు వై.వెంకటరెడ్డి సూచించారు. బుడితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సారవకోటలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో అమలవుతున్న ఎల్ఐపీ కార్యక్రమాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండేళ్ల కరోనా సమయంలో విద్యార్థులు పాఠశాలలకు హాజరు కాకపోవడంతో చదివే శక్తి తగ్గిందన్నారు. చదువుపై ఆసక్తి చూపేలా ఆరు నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులకు లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో మూడు రోజుల పాటు ఈ కార్యక్రమం అమలు తీరును పరిశీలించనున్నట్టు పేర్కొన్నారు. తాను పరిశీలించిన పాఠశాలల్లో ఉపాధ్యాయులు పాఠాలను బోధిస్తున్నప్పటికీ దానిని పిల్లలు అభ్యాసనం చేయడంలో లోపం ఉన్నట్లు గుర్తించామన్నారు. ఆ లోపాలను సరి చేసుకుని విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యం పెంపొందించేందుకు కృషి చేయాలని సూచించారు. ఎంఈవో ఎం.వి.రమణ, కేజీబీవీ ఎస్‌వో శిరీష ఉన్నారు.

భువికకు నటరాజ పురస్కారం ప్రదానం



పురస్కారం అందుకుంటున్న భువిక

పోలాకి: గొల్లవలస గ్రామానికి చెందిన ఆరో తరగతి విద్యార్థిని నీలంరాజు భువికకు నటరాజ జాతీయ పురస్కారం వరించింది. ఈనెల 12న తమిళనాడులోని రామేశ్వరం శ్రీనటరాజ టెంపుల్‌లో నేషనల్ క్లాసికల్ డాన్స్ అకాడమీ వారిచే నిర్వహించిన ఆలిండియా క్లాసికల్ డాన్స్ ఫెస్టివల్‌లో భువికకు పురస్కారాన్ని ప్రదానం చేశారు. భువికకు నృత్యమంటే ఇష్టం. దీంతో తల్లిదండ్రులు విజయవాడలోని ప్రముఖ నృత్యకళాకారుడు అజయ్‌కుమార్ వద్ద క్లాసికల్ డాన్స్ నేర్పించారు. ఇప్పుడు జాతీయ పురస్కారం అందుకోవటంపై తల్లిదండ్రులు శరత్ కుమార్, క్రిష్ణకుమారిలు ఆనందం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

కరాటే పోటీల్లో విద్యార్థులకు పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన సీఎం కప్ కరాటే చాంపియన్ షిప్‌లో విజయనగరంలోని శ్రీ గురుదత్త పాఠశాలకు చెందిన విద్యార్థులు పతకాలు సాధించారు. ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు విశాఖలోని స్వర్ణభారతి స్టేడియంలో జరిగిన పోటీల్లో పాఠశాలకు చెందిన ఇ.హేమంత్, ఎస్.జితేంద్ర, బి.శ్రీకర్‌లు కాంస్య పతకాలు దక్కించుకున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.పద్మ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను సోమవారం ఆమె సహ ఉపాధ్యాయులతో కలిసి అభినందించారు.

పరుగు వీరుడు

- మెట్టవలస యువకుడి ప్రతిభ



సాధించిన పతకాలతో బొబ్బిలి సతీష్

బొబ్బిలి రూరల్: ఖరగ్‌పూర్ ఐఐటీ క్రీడామైదానంలో ఈనెల 10నుంచి 12వరకు జరిగిన 42వ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలలో మెట్టవలసకు చెందిన బొబ్బిలి సతీష్ సత్తా చాటి పలు పతకాలు సాధించాడు. 30ప్లస్‌లో 100మీటర్ల పరుగుపందెంలో మూడోస్థానంతో కాంస్యపతకం, 200మీటర్లలో ప్రథమస్థానంతో బంగారుపతకం, 400మీటర్లలో రెండోస్థానంలో నిలిచి రజత పతకం సాధించాడు. అలాగే లాంగ్‌జంప్‌లో మూడోస్థానంలో నిలిచి కాంస్యపతకం సాధించాడు. పలు పతకాలు సాధించిన బొబ్బిలి సతీష్‌ను మెట్టవలసలో, బొబ్బిలిలో పలువురు ప్రత్యేకంగా గురువారం అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం టౌన్: జిల్లాలోని పార్వతీపురం, పాలకొండ, సాలూరు ఆర్టీసీ బస్ డిపోలకు హెచ్ఎస్‌డీ ఆయిల్ సరఫరా చేసేందుకు ఆసక్తి గల జిల్లాలోని హెచ్ఎస్‌డీ ఆయిల్ బంక్ యజమానుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజారవాణా అధికారి టీవీఎస్ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. టెండర్ దరఖాస్తులను ఈ నెల 14 నుంచి 23 వరకూ పార్వతీపురం, పాలకొండ, సాలూరు డిపో మేనేజర్ల కార్యాలయాల్లో లభిస్తాయని పేర్కొన్నారు. పూర్తి చేసిన టెండర్ ఫామ్స్‌ను 25వ తేదీ మధ్యాహ్నం 2 గంటల లోగా జిల్లా ప్రజారవాణా అధికారి, పార్వతీపురం మన్యం కార్యాలయంలో సమర్పించాలన్నారు. 25వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా ప్రజారవాణా అధికారి, పార్వతీపురం మన్యం కార్యాలయంలో టెండర్లు తెరుస్తారని పేర్కొన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్

లక్కవరపుకోట: మండలంలోని కళ్లేపల్లి గ్రామం శివారులో సరుగుడు తోటల్లో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఎస్సై ఎ.ముకుందరావు ఆధ్వర్యంలో పోలీసులు గురువారం సాయంత్రం దాడి చేసి ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.90,190 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. జూదరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

సెపక్‌తక్రా జిల్లా జట్ల ఎంపిక

విజయనగరం పూల్‌బాగ్: స్థానిక వీటీఅగ్రహారం ఉన్నత పాఠశాలలో అండర్-14,17, బాలబాలిక సెపక్‌తక్రా జిల్లాజట్ల ఎంపిక పోటీలను గురువారం నిర్వహించారు. ఇందులో ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయి పోటీల్లో తలపడే జిల్లా జట్లకు ఎంపిక చేశారు. ఎంపిక పోటీలను జీజీఎఫ్ సెక్రటరీ ఎల్.వి.రమణ, హెచ్ఎం రాజేశ్వరరావు ప్రారంభించారు. పీడీలు ధర్మారావు, కృష్ణ, ఆనంద్, చంటి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

శంబర పోలమాంబ హుండీల ఆదాయం లెక్కింపు



హుండీల ఆదాయం లెక్కిస్తున్న దేవదాయ శాఖ సిబ్బంది

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి హుండీల ఆదాయాన్ని ఈఓ వి.రాధాకృష్ణ, సాలూరు గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణాధికారి ఎం.ప్రసాదరావు, ట్రస్టుబోర్డు చైర్మన్ పూడి దాలినాయుడు సమక్షంలో గురువారం లెక్కించారు. పోలమాంబ అమ్మవారి చదురుగుడి, వనంగుడి ఆలయాల్లో మూడు, నాల్గవ జాతరలో భక్తులు హుండీలలో సమర్పించుకున్న కానుకల రూపంలో రూ.11,93,917 ఆదాయం వచ్చినట్టు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టుబోర్డు కమిటీ సభ్యులు, దేవదాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి మృతి

ఉమ్మడి విజయనగరం జిల్లాలో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో గురువారం నలుగురు మృతి చెందగా మరో ఇద్దరు మహిళలు గాయపడ్డారు. పోలీసులు, మృతుల బంధువులు తెలిపిన ఆయా ప్రమాదాల వివరాలిలా ఉన్నాయి.



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన వెంకటరావు

శృంగవరపుకోట: మండలంలోని కొట్టాం గ్రామానికి చెందిన పిల్లా వెంకటరావు(50) గ్రామంలో విద్యుత్ షాక్‌తో తగలడంతో గురువారం మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. అదే గ్రామానికి చెందిన తన మేనల్లుడు ఏడువాక అచ్చంనాయుడుకు చెందిన విద్యుత్ మోటార్‌ను మరమ్మత్తు చేస్తున్న సమయంలో వెంకటరావు విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. దీంతో గ్రామస్తులు హుటాహుటిన ట్రాక్టర్‌పై శృంగవరపుకోట ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. అయితే ఆస్పత్రికి చేరే సమయానికే వెంకటరావు మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుడు వెంకటరావు తల్లి బుచ్చమ్మ గ్రామంలో ఉంటుండగా, భార్య రమణమ్మ, కుమారులు కోటరావు, సతీష్‌లతో కలిసి వెంకటరావు విశాఖలో నివాసం ఉంటున్నాడు. తన అక్క-బావలు అచ్చియ్యమ్మ-అప్పారావుల కొడుకు ఇంటి నిర్మాణ పనుల్లో సాయం చేసేందుకు వచ్చిన వెంకటరావు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. ఫిర్యాదు మేరకు ఎస్.కోట ఎస్సై లోవరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెట్టు పైనుంచి పడి వ్యక్తి..



మృతి చెందిన గీత కార్మికుడు అదివయ్య

గజపతినగరం రూరల్: మండలంలోని గంగచోళ్లపెంట గ్రామానికి చెందిన గీత కార్మికుడు ముంత అదివయ్య(41) తాటిచెట్టు పైనుంచి జారిపడి మృతి చెందినట్లు గజపతినగరం ఎస్సై గంగరాజు గురువారం తెలిపారు. ఈ మేరకు విలేకరులతో ఆయన మాట్లాడుతూ అదివయ్య కల్లు గీత కార్మికుడని, కల్లు గీసేందుకు తాటిచెట్టుపైకి ఎక్కి ప్రమాదవశాత్తు జారిపడి గాయాలపాలవడంతో స్థానికులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందినట్లు చెప్పారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గాయపడిన వ్యక్తి..

పాలకొండ రూరల్: మండలంలోని తుంపటాపల్లి సమీపంలో బుధవారం రాత్రి ద్విచక్ర వాహనం ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో గాయపడిన నలుగురిలో బలగ పోలయ్య(50) శ్రీకాకుళం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మరణించాడు. మృతునికి భార్య గున్నమ్మతోపాటు ముగ్గురు పిల్లలున్నారు. కుటుంబ పెద్దను కోల్పోవడంతో పోలయ్య బంధువులు కన్నీటిపర్యంతమయ్యారు. దీనిపై ఎస్సై బి.శివప్రసాద్ గురువారం కేసు నమోదు చేశారు.

లగేజీ ఆటోపై నుంచి జారిపడి మహిళ..



మృతురాలు దానమ్మ

పూసపాటిరేగ: మండలంలోని పతివాడబర్రిపేట సమీపంలో ఆర్అండ్‌బీ రహదారిపై లగేజీ ఆటోపై నుంచి జారిపడి గురువారం ఓ మహిళ మృతి చెందగా, మరో ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. పతివాడబర్రిపేటకు చెందిన ముగ్గురు మహిళలు గ్రామం నుంచి వెళ్తున్న లగేజీ ఆటోపై ఉన్న ఐస్‌బాక్సులపై ఎక్కి ప్రయాణం చేస్తుండగా చినపతివాడ సమీపంలో మలుపువద్ద ఆటోనుంచి కిందకు జారి పడిపోయారు. దీంతో వాసుపల్లి దానమ్మ (50) మృతి చెందగా, మరో ఇద్దరు మహిళలు గాయపడ్డారు. గాయపడిన మహిళలను విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం సుందరపేట ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ఈ మేరకు పూసపాటిరేగ ఎస్సై ఎ.నరేష్ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కురుపాం జూనియర్ జడ్జిగా రోహిణీరావు

విజయనగరం లీగల్: పార్వతీపురంమన్యం జిల్లా కురుపాం జూనియర్ సివిల్ జడ్జిగా ఎం.రోహిణీరావు నియమితులయ్యారు. ఈ మేరకు హైకోర్టు గురువారం ఉత్తర్వులు జారీచేసింది. రోహిణీరావు స్వస్థలం శ్రీకాకుళం జిల్లా పాలకొండ పట్టణం. ఇటీవల జరిగిన జూనియర్ సివిల్‌జడ్జి పోస్టుల భర్తీలో ఆమె ఎంపికయ్యారు.

తృణధాన్యాల పాడి పోస్టర్ ప్రదర్శన



ప్రదర్శన సర్టిఫికెట్‌ను అందిస్తున్న ప్రొఫెసర్ బీఎస్ జగతప్

రాజాం సిటీ: తృణధాన్యాల పాడి పోస్టర్ ప్రదర్శనకు ప్రశంసలు లభించాయని కంచరాం జెడ్పీహెచ్ స్కూల్ భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు పి.వేణుగోపాల్ గురువారం తెలిపారు. ఢిల్లీలో శాస్త్రీయ పారిశ్రామిక పరిశోధన పరిషత్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ కమ్యూనికేషన్ అండ్ ఇన్ఫర్మేషన్ రిసోర్స్ ఆధ్వర్యంలో ఈ నెల 14, 15 తేదీల్లో సంప్రదాయ జ్ఞాన విస్తృత ప్రచారం, వ్యాప్తిపై జరిగిన అంతర్జాతీయ సమావేశంలో తను ప్రజెంట్ చేసిన తృణధాన్యాల పాడి పోస్టర్ శాస్త్రవేత్తలను ఆకట్టుకుందని తెలిపారు. సీఎస్ఐఆర్, ఎన్ఐఎస్‌సీపీఆర్ డైరెక్టర్ ప్రొఫెసర్ రంజనా అగర్వాల్, ప్రొఫెసర్ బీఎస్ జగతప్‌లు అభినందించారని తెలిపారు. ఉపాధ్యాయుడిని హెచ్ఎం ఎంవీ సాయీశ్వరి, సర్పంచ్ గెడ్డాపు సుబ్బమ్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట

- ఫైలేరియా స్టేట్ కన్సల్టెంట్, జిల్లా మలేరియా ఆఫీసర్

రామభద్రపురం: ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఫైలేరియా స్టేట్ కన్సల్టెంట్ ఎం.లక్ష్మణరావు, జిల్లా మలేరియా ఆఫీసర్ ఎం.తులసి అన్నారు. స్థానిక పీహెచ్‌సీ, కొట్టక్కిలో బోదకాలు నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం వారు పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ బోదకాలు వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. ఈ నెల 10వ తేదీ నుంచి బోదకాలు వ్యాధి నివారణ మాత్రలు పంపిణీ చేస్తున్నామని, ఇప్పటి వరకు జిల్లాలో 87 శాతం మందికి పంపిణీ పూర్తి చేసినట్లు తెలిపారు. ఫైలేరియా వ్యాధి సోకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామన్నారు. బోదకాలు వ్యాధి గ్రస్తులు ఉండే ప్రాంతాలలో ప్రతి ఆరు నెలలకు ఒకసారి రక్త నమూనాలు సేకరించి పరీక్షలు చేస్తున్నామని తెలిపారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి ముందు మురుగు కాలువలు ఉంటే వాటిలో దోమలు చేరే ప్రమాదం ఉందని, మురుగు లేకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో స్టేట్ కన్సల్టెంట్ జి సతీష్‌కుమార్, పీహెచ్‌సీ వైద్యాధికారులు దిలీప్‌కుమార్, ఏఎల్‌జి శిరీష, సీహెచ్‌వో చిన్నికృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.వాసుదేవరావు పాల్గొన్నారు.

జాతీయ సమగ్రత శిబిరానికి ఎంఆర్ విద్యార్థి ఎంపిక



అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ సాంబశివరావు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

విజయనగరం అర్బన్: పంజాబ్‌లోని పాటియాలో ఈ నెల 16 నుంచి 22వ తేదీ వరకు జరగనున్న జాతీయ సమగ్రత శిబిరానికి పట్టణంలోని మహారాజా అటానమస్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్ వసంత సాయికృష్ణ ఎంపికయ్యాడు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సాంబశివరావు గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపికైన 10 మంది వలంటీర్లలో విజయనగరం జిల్లా నుంచి తమ విద్యార్థి ఉన్నాడని తెలిపారు. ఏడు రోజుల పాటు జరిగే ఈ శిబిరంలో రాష్ట్ర విశిష్టతను తెలిపే సాంస్కృతిక కార్యక్రమాల్లో తమ విద్యార్థి పాల్గొంటాడని పేర్కొన్నారు. ఎంపికైన వలంటీర్‌ను ప్రిన్సిపాల్ సాంబశివరావు, ఎన్ఎస్ఎస్ పీఓలు జి.చంద్రశేఖర్, ఎం.శ్రీకాంత్, సీహెచ్.చిన్నంనాయుడు, డాక్టర్ పీఎస్‌వీ శర్మ, కన్వీనర్లు డి.సన్యాసిరావు, ఎస్.నవీన్‌కుమార్, ఎస్‌వీరమణ తదితరులు అభినందించారు.

క్రీడాకారులకు ఎంపీ అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అభినందించారు. ఇంటర్ యూనివర్సిటీ, ఖేలో ఇండియా యూత్ గేమ్స్ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కొండవెలగాడకు చెందిన వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులను గురువారం చీపురుపల్లిలో గల తన నివాసంలో అభినందించారు. జనవరి 27 నుంచి 30 వరకు కోల్‌కత్తాలో జరిగిన ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో ఎస్.పల్లవి బంగారు పతకం సాధించింది. అలాగే ఫిబ్రవరి 6 నుంచి 12 వరకు ఇండోర్‌లో జరిగిన ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో బి.హారిక(బ్రాంజ్), సీహెచ్.లక్ష్మి(బంగారు) పతకాలు సాధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెయిట్‌లిఫ్టింగ్ క్రీడల్లో కొండలవెలగాడకు చెందిన క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారని ప్రశంసించారు. వారికి నిరంతరం ప్రభుత్వం తరపున ప్రోత్సాహం ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కోచ్‌లు సీహెచ్.రాము, ఎం.శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పుణ్యక్షేత్ర యాత్రలను సద్వినియోగం చేసుకోండి


- ఐఆర్‌సీటీసీ ప్రాంతీయ మేనేజర్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఐఆర్‌సీటీసీ ప్రాంతీయ మేనేజర్ చంద్రమోహన్ బిశా తదితరులు

విజయనగరం టౌన్: భారత్ గౌరవ్ టూరిస్ట్ ట్రైన్ ఆధ్వర్యంలో పుణ్యక్షేత్ర యాత్ర పేరుతో పూరీ-కాశీ-అయోధ్యలో పలు దర్శనీయ ప్రాంతాలను సందర్శించేందుకు ప్రయాణికులకు ప్రత్యేక రైలు ఏర్పాటుచేసినట్లు ఐఆర్‌సీటీసీ ప్రాంతీయ మేనేజర్ చంద్రమోహన్ బిశా తెలిపారు. ఈ మేరకు గురువారం రైల్వే స్టేషన్ ఆవరణలో ఉన్న కాన్ఫరెన్స్ హాల్‌లో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ నుంచి ప్రారంభమయ్యే రైలు విజయనగరం మీదుగా పూరీ, గయ, వారణాసి, అయోధ్య, ప్రయాగ తదితర ప్రాంతాల్లో ఉన్న పుణ్యక్షేత్రాలకు భక్తులను క్షేమంగా తీసుకువెళ్లి, వారికి అవసరమయ్యే అన్ని రకాల వసతి, భోజనం, ప్రయాణ సదుపాయాలను ఐఆర్‌సీటీసీయే భరిస్తుందన్నారు. స్లీపర్, 2ఏసీ, థర్డ్ ఏసీ టికెట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. మార్చి 18 నుంచి 25 వరకూ ఏడురాత్రులు, ఎనిమిది రోజుల పాటు యాత్ర ఉంటుందన్నారు. వివరాలకు ఫోన్ 8287932318, 9701085461 నంబర్లను కానీ విశాఖపట్టణంలో ఉన్న ఐఆర్‌సీటీసీ కార్యాలయంలో గానీ సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌వీజీ.ప్రసాదరావు, చీఫ్ బుకింగ్ సూపర్‌వైజర్ జె.శ్రీనివాస.రావు తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది ఎకరాల చెరకుపంట దగ్ధం



కాలిపోయిన చెరకుగడలు చూపిస్తున్న రైతు


సంతకవిటి: మండలంలోని బూరాడపేట గ్రామ పంటపొలాల్లో జరిగిన అగ్నిప్రమాదంలో రైతులకు చెందిన 8 ఎకరాల చెరకు పంట అగ్నికి ఆహుతైంది. బుధవారం రాత్రి ఈ ప్రమాదం సంభవించింది. గ్రామానికి చెందిన కెంబూరు కృష్ణ, తాడేల వాసు, కెంబూరు రామారావు, కెంబూరు హరి, లోలుగు అక్కలనాయుడు, తాడేల శంకరరావు, బూరాడ విష్ణు, బూరాడ రంగ, మీసాల కృష్ణ, సీపాన శ్రీరాములు, మీసాల ఆదినారాయణ లకు చెందిన చెరకు పంట పూర్తిగా కాలిపోయింది. రూ. 7.50 లక్షలకు పైగా ఆస్తినష్టం సంభవించిందని బాధితులు వాపోతున్నారు. స్థానిక రైతులు ప్రమాదాన్ని గుర్తించి, పంటపొలాల్లోని చిన్నచిన్నకాలువల్లో ఉన్న నీటిని ఆయిల్ ఇంజిన్ల సాయంతో తోడి మంటలు అదుపుచేశారు. తహసీల్దార్ ఎ.సులోచనారాణి రెవెన్యూ సిబ్బంది ద్వారా పంట నష్టం అంచనా రూపొందిస్తున్నారు.

కొరమలో మహిళ మృత అవశేషాలు

- సంఘటన స్థలంలో పుర్రె, ఎముకలు, చీర గుర్తింపు
- హత్య చేసి పడవేసినట్లు అనుమానం



మృతురాలి అవశేషాలు గుర్తిస్తున్న తహసీల్దార్ అప్పారావు, ఎస్సై అమ్మాన్‌రావులు



మృతురాలి పుర్రె,ఎముకలు

భామిని: మండలంలో గుర్తు తెలియని మహిళ మృతదేహం అవశేషాలు బయటపడడంతో భయాందోళనలు నెలకొన్నాయి. వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలం కొరమ సమీపంలోని వంశధార కాలువ సమీపంలో మహిళ మృతదేహం ఆనవాళ్లు గురువారం కనిపించాయి. ఎక్కడో హత్య చేసి తీసుకువచ్చి స్థానికంగా పారవేసినట్లు భావిస్తున్నారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో బత్తిలి ఎస్సై వై.అమ్మాన్‌రావు, భామిని తహసీల్దార్ నీలాపు అప్పారావులు ప్రమాద స్థలానికి చేరుకుని పరిశీలించి మహిళ మృతదేహం ఆనవాళ్లుగా నిర్ధారించారు. ఆమెకు సుమారు 30 ఏళ్లు ఉండొచ్చని అంచనా వేశారు. మృతురాలి పుర్రె, ఎముకలు, తల జుత్తు, గాజులు,చీర, లంగా వేర్వేరుగా పడి ఉండడాన్ని గుర్తించి ఆనవాళ్లు సేకరించారు. సుమారు రెండు నెలల క్రితం మరణించినట్లు పోలీసులు అంచనా వేశారు. కానీ బత్తిలి పోలీస్‌స్టేషన్‌లో మహిళ మిస్సింగ్ కేసు నమోదు కాలేదని ఎస్సై వై.అమ్మాన్ రావు తెలిపారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

కొత్తూరు వివాహితగా అనుమానాలు

భామిని మండలం కొరమ సమీపంలో గుర్తించిన మహిళా మృతదేహం ఆనవాళ్లను బట్టి మృతురాలు శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలానికి చెందిన వివాహితగా ప్రచారం జరుగుతోంది. గత నెల 1వతేదీన భామిని మండలం వచ్చిన వివాహిత అదృశ్యమైనట్లు కొత్తూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనట్లు సమాచారం. కొరమ వద్ద గుర్తించిన మృతురాలి దుస్తులను చూసిన సమీప బంధువులు అదృశ్యమైన వివాహిత ధరించిన చీరగా చెబుతున్నారు. పోలీసులు పూర్తిస్థాయి దర్యాప్తు చేస్తే నిజాలు బయట పడతాయని మృతురాలి సమీప బంధువులు భావిస్తున్నారు.

వంగరలో ఏనుగుల గుంపు



లక్ష్మీపేటలో ఏనుగులు ధ్వంసం చేసిన ధాన్యం



వంగర: ఏనుగుల గుంపు

వంగర: ఏనుగుల గుంపు వంగర మండలంలోకి ప్రవేశించాయి. పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలం నారాయణపురం మీదుగా వంగర మండలంలోని కొప్పర-కొండచాకరాపల్లి గ్రామాల సమీపంలో సువర్ణముఖి నది దాటుకొని లక్ష్మీపేట, కొట్టిశ గ్రామాల పొలిమేరకు చేరుకున్నాయి. లక్ష్మీపేటలో గంట్యాడ కృష్ణమూర్తి, గంట్యాడ ఆదినారాయణలకు చెందిన 50 బస్తాల ధాన్యంను ధ్వంసం చేశాయి. అనంతరం మద్దివలస గ్రామం మీదుగా తలగాం వద్ద ఓ రైస్‌మిల్లు వద్ద తిష్టవేసిన ఏనుగులు పంటపొలాల్లోకి చేరాయి. తహసీల్దార్ డి.ఐజాక్ పర్యవేక్షణలో రెవెన్యూ సిబ్బంది గ్రామాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. విజయనగరం అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ బి.అప్పలరాజు, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ జె.సుధీర్, కేవీఎస్‌రాజు, బీట్ ఆఫీసర్ కర్రిస్వప్న, ఎస్.కిరణ్, వంగర పోలీస్ సిబ్బంది అక్కడకు చేరుకొని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. ట్రాన్స్‌కో ఏఈ కె.వినయ్‌కుమార్ ఎం.సీతారాంపురం ఫీడర్‌లో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.

పెట్రోల్ బంకుల్లో ఆకస్మిక తనిఖీలు

విజయనగరం అర్బన్: సివిల్ సప్లై కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పెట్రోల్ బంకుల్లో గురువారం కూడా తనిఖీలు కొనసాగాయి. ఈ నెల 21వ తేదీ వరకు జిల్లాలోని 27 మండలాల పరిధిలోని 112 అవుట్‌లెట్స్‌లను తనిఖీ చేయనున్నారు. తహసీల్దార్, బంకు సేల్స్ ఆఫీసర్/రిప్రజెంటేటివ్, లీగల్ మెట్రాలజీ ఆఫీసర్, సీఎస్‌డీటీలతో ఏర్పడిన బృందం తనిఖీలను చేపడుతోంది. మోటార్ స్పిరిట్, స్పీడ్ డీజిల్ ఆర్డర్-2005 ప్రకారం తనిఖీ అధికారాలను ఆయా మండలస్థాయి బృందాలకు ప్రభుత్వం అప్పగించింది. తనిఖీ ద్వారా గుర్తించిన అవుట్‌లెట్ సామర్థ్యం, క్వాలిటీ, క్వాంటిటీ, వినియోగదారులకు కల్పిస్తున్న సౌకర్యాలు వంటి అంశాలను ప్రత్యేక యాప్‌లో నమోదుచేస్తారు. తనిఖీల సమయంలో గుర్తించిన సమస్యలను వచ్చే జూన్‌లోగా పరిష్కరించాల్సి ఉంటుంది. తహసీల్దార్ బంగారురాజు, సీఎస్‌డీటీ జనగ్‌తో కూడిన బృందం పట్టణంలోని కంటోన్మెంట్ అవుట్‌లెట్‌ను తనిఖీచేసింది.

ఆరోగ్యశ్రీ రోగులకు సకాలంలో వైద్యసేవలు అందించండి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ అప్పలరాజు

- ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ అప్పలరాజు

విజయనగరం ఫోర్ట్: ఆరోగ్యశ్రీ రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ ఉప్పు అప్పలరాజు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల మెడికోలతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చికిత్స కోసం వచ్చిన వారికి ఒక్క పైసా ఖర్చు కాకూడదని స్పష్టం చేశారు. ఆరోగ్యశ్రీ రోగులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. రోగులకు చికిత్స అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. ఓపీ సేవలు కూడా ఉచితంగా అందించాలని చెప్పారు. ఏ నెట్‌వర్క్ ఆస్పత్రిలో ఏఏ రకాల స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయో ఆస్పత్రిలో ప్రదర్శించాలని కోరారు. సమావేశంలో టీమ్ లీడర్లు తుంపల్లి జనార్దనరావు, రాయవరపు మత్యాలనాయుడు, భాను, ఉమ, దేవిలు పాల్గొన్నారు.

వెయ్యిమంది దంపతులకు షష్టిపూర్తి



స్వామివార్ల కల్యాణోత్సవాన్ని జరుపుతున్న వేదపండితులు



షష్టిపూర్తి మహోత్సవంలో పాల్గొన్న దంపతులు



స్వామివారికి సమర్పించిన పిండివంటలు, పండ్లు

కొత్తవలస రూరల్: కొత్తవలస మండలం మంగళపాలెంలోని సీతారామచంద్రస్వామి ఆలయ 21వ వార్షికోత్సవాన్ని మూడు రోజులుగా నిర్వహిస్తున్నారు. గురుదేవా చారిటబుల్ ట్రస్టు, ఆలయ కమిటీ, గౌరీసేవా సంఘం ఆధ్వర్యంలో సీతారాములు, వెంకటేశ్వర కల్యాణోత్సవాలను గురువారం వైభవంగా నిర్వహించారు. అయోధ్య రామమందిరం అర్చకుడు సత్యేంద్రకుమార్‌దాస్ పర్యవేక్షణలో 30 మంది వేద పండితులు శాస్త్రోక్తంగా స్వామివార్ల కల్యాణోత్సవాన్ని జరిపారు. వేలాది మంది భక్తులు స్వామివారికి, అమ్మవార్లకు సారెను సమర్పించారు. అనంతరం గురుదేవా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు చేతుల మీదుగా 1000 మంది దంపతులకు శాస్త్రోక్తంగా షష్టియద్ధి మహోత్సవాలను నిర్వహించారు. 10వేల మంది భక్తులకు అన్నసమారాధన జరిపారు.